క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బల్మూర్: మండల కేంద్రంలో సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికి సీఎం రిలీఫ్‌ఫండ్ వచ్చే విధంగా ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఖదీర్, వెంకటయ్య, రమేష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మాజీ ఎంపీటీసీ మృతి

చారకొండ: మండలంలోని జూపల్లి మాజీ ఎంపీటీసీ అర్కంటి బాలస్వామి పది రోజులు కిందట అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఆయన కన్నుమూశారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు రాములు యాదవ్, ప్రభాకర్ రెడ్డి, పుల్లారావు తదితరులు ఉన్నారు.

కూలిన మట్టిమిద్దె

బల్మూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మండలంలోని అనంతవరంలో మహ్మద్‌జహంగీర్‌కు చెందిన మట్టిమిద్దె శనివారం కూలింది. ప్రమాదాన్ని పసిగట్టి కుటుంబసభ్యులు వెంటనే బయటకు రావడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారుల హామీతో దీక్ష విరమణ



తెలకపల్లి: మండలంలోని కార్వంగ, జమిస్తాపూర్ గ్రామాల మధ్యలో బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలని రెండు రోజుల కిందట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శనివారం దీక్ష శిబిరాన్ని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ దీక్షా స్థలానికి చేరుకొని రోడ్డు పనులు వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డీఈ గోవిందనాయక్ దీక్షలో ఉన్న నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, రోడ్డు సాధన కమిటీ కన్వీనర్ నందిపేట భాస్కర్, గోపస్ లక్ష్మణ్, విజయ్‌గౌడ్, రామకృష్ణ, మామిళ్లపల్లి లక్ష్మీ, బాలనాగయ్య, మహిళలు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించండి

తాడూరు: విద్యార్థుల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పిల్లలను పాఠశాలలకు పంపించాలని హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని పాల్మూరు, మేడిపూర్, అల్లాపూర్ పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


ఉప్పునుంతల: పిల్లలు చదువుకునేవిధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని హెచ్ఎం శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: కస్తూర్బా పాఠశాలలో కలుషిత ఆహారం అరికట్టాలని బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాధికారి గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కస్తూర్బాలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని కోరారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు సురక్షితం



పాన్‌గల్: సురక్షిత కాన్పుల కోసం ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గర్భిణి చంద్రకళ ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య సమాచార వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులను వృథా చేసుకోవద్దని ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని రకాల వసతులు ఉన్నాయని తెలిపారు. పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు అవుతున్నాయని అవగాహన కల్పించారు.



కల్వకుర్తిలో..



నాగర్‌కర్నూల్‌లో..



లింగాల సీహెచ్‌సీ ఎదుట..



తెలకపల్లిలో

వైద్యురాలి హత్యపై నిరసన

నాగర్‌కర్నూల్‌రూరల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై హత్యాకాండకు నిరసనగా శనివారం ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలో ధర్నా చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఐఎంఏ యూనియన్ ఆధ్వర్యంలో వైద్యులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షులు మాణిక్యాల చెన్నయ్య, డా రాజేష్ రెడ్డి, నరహరి, రమేష్‌చంద్ర, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదుట వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. నల్లబ్యాడ్జీలను ధరించి ఓపీ సేవలను బంద్‌చేసి నిరసన తెలిపారు. ప్రైవేటు వైద్యులు ఓపీ సేవలను బంద్ పాటించాయి. కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. వైద్యాధికారులు శివశంకర్, సీహెచ్‌ఓ అశోక్‌ప్రసాద్, బిక్‌లాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేసి ధర్నా నిర్వహించారు. దేశమోని ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్, వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. డాక్టర్లు బిక్కులాల్, స్వప్న, స్టాఫ్‌నర్సు ఉఫత్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు రద్దు చేసి నిరసన తెలిపారు. ఆర్ఎంపీలు వైద్యులు సేవలను బహిష్కరించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు రాములు నాయక్, విష్ణు, యశోద, షకీల్, శిరీష, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి, జాయ్ మెర్సీ, ల్యాబ్ సిబ్బంది సత్యం, శ్రీకాంత్, సిబ్బంది, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

కొల్లాపూర్: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి వైద్యా విద్యార్థినికి నివాళి అర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ గేట్ వద్ద ధర్నా చేశారు. కొల్లాపూర్ డాక్టర్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాంప్రసాద్, కోశాధికారి బిల్లా యాదగిరి, శివరాజ్, దిలీప్, హిమకుమారి, ప్రవీణ్‌కుమార్, సాహిద్, అనిల్, జీకే వెంకటేష్ ఉన్నారు.

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ కూడలీలో యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పెర్మల యశ్వంత్, అరుణ్ పాండ్యన్, ఉదయ్, యశ్వంత్, అరవింద్, రాజశేఖర్, అన్వేష్, వెంకటేష్, మధు, పాండయ్య, రాజారాం, బంటి, ఎల్లేష్ పాల్గొన్నారు.



మన్ననూరులో నివాళులర్పిస్తున్న యువకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన



లింగాల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. వంటగది, పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివశంకర్, ప్రశాంత్, అనిల్‌కుమార్, ఎస్‌ఓ శారద పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

బల్మూర్: బాలిక అదృశ్యమైన ఘటనలో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని బాణాల గ్రామానికి చెందిన ఓ బాలిక ఈనెల 13 నుంచి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో 'రాఖీ' వేడుకలు

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో ముందస్తుగా శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని నీకు నేను రక్షా, నాకు నీవు రక్ష, మనందరం దేశానికి, ప్రపంచానికి రక్ష అంటూ నినాదాలు చేస్తూ రాఖీలు కట్టుకున్నారు. ఈ రాఖీ పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని వివిధ పాఠశాలలో ముందస్తుగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్షాబంధన్ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. అన్నాచెల్లెల, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు.

పెద్దకొత్తపల్లి: కల్వకోలు గ్రామంలోని చందు కాన్సెప్ట్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. కరస్పాండెంట్ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బలాన్‌పల్లి పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కల్వకుర్తి టౌన్: రెండు రోజులు సెలవులు ఉండటంతో పలు పాఠశాలల్లో ముందస్తుగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని సంబురపడ్డారు.

హిందువులపై దాడులు నిరసిస్తూ ఆందోళన

అచ్చంపేట: బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపుమేరకు శనివారం అచ్చంపేట బంద్ పాటించారు. పట్టణంలో దుకాణాలు, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. పట్టణంలో భ్రమరాంబ ఆలయం నుంచి ప్రధాన రహదారి కూడళ్ల గుండా హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ధర్నా నిర్వహించారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిందు సంఘాల నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్కడ నివసిస్తున్న కోటి 30 లక్షల మంది హిందువులను సీఏఏ చట్టం ద్వారా దేశానికి తీసుకురావాలని కోరారు. మనదేశంలో అక్రమంగా ఉంటున్న ఐదు కోట్ల మంది రోహింగ్యా ముస్లింలను గుర్తించి బంగ్లాదేశ్‌కు పంపించాలన్నారు. విశ్వహిందు పరిషత్ ప్రముఖ్ వెంకటేశ్వరశర్మ, బీజేపీ నాయకులు మంగ్యానాయక్, మండికారి బాలజీ, గోపాల్‌యాదవ్, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేష్, కేతేపల్లి వెంకటేష్, గిరిజన సంఘం నాయకులు గోపాల్‌నాయక్, గోలిశంకర్, రంగినేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో రాస్తారోకో చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బిజినేపల్లి మండలంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అయోమయంలో రైతులు

ఉప్పునుంతల/పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసింది. రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకోవడంతో అర్హులు కూడా ఎంతో మంది రుణమాఫీకి దూరం అయ్యారు. రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రుణమాఫీ అయ్యిందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. మూడు విడతల్లో న్యాయం చేకూరలేదని పలువురు రైతులు వాపోయారు.

రుణమాఫీ వర్తించలేదు



గుడిపల్లి ఐసీఐసీఐ బ్యాంకులో రూ.8 లక్షల రుణం ఉంది. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు వర్తించలేదు. ఎంతో ఆశగా ఎదురుచూశాం. కాని నిరాశే మిగిలింది. ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

– మల్లయ్య, పెద్దకొత్తపల్లి

ఆశగా ఎదురుచూశాం..



గుడిపల్లి ఐసీఐసీఐ బ్యాంకులో రూ.4 లక్షల రుణం తీసుకున్నాం. ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని ఆశపడి ఎదురుచూసినా రుణమాఫీ కాలేదు.

–గుంత జంపయ్య, పెద్దకొత్తపల్లి

రుణమాఫీ కాలేదు



ఉప్పునుంతల శివారులో ఐదు ఎకరాల పొలం ఉంది. గ్రామీణ వికాస్ బ్యాంకులో భార్య పార్వతమ్మ పేరిట రూ. 50 వేలు పంట రుణం తీసుకున్నా. వడ్డీతో కలిపి రూ.75 వేలు అయ్యింది. మూడు విడతల్లో రుణమాఫీ కాలేదు. రెండెకరాలు కదువపెట్టి ప్రైవేట్ బ్యాంకులో తన కుమారుడు రూ.6.99 లక్షలు రుణం తీసుకున్నాడు. దీంతో రుణమాఫీ కాలేదని అధికారుల పేర్కొంటున్నారు.

– గంధం రామలింగయ్య, రైతు, తాడూరు

నిరాశే మిగిలింది



మూడు ఎకరాల చొప్పన తనతో పాటు భార్యకు మూడు ఎకరాల భూమి ఉంది. ఏపీజీవీబీలో రూ. 1.60 లక్షలు, భార్య జాహెదా బేగం పేరిట రూ.1.10 లక్షలు వడ్డీతో సహా పంటరుణం ఉంది. ఇద్దరికి కలిపి రూ.2 లక్షలు దాటడంతో రుణమాఫీ కాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

– ఎండీ నజీర్ పాషా, రైతు, ఉప్పునుంతల

వ్యక్తికి గాయాలు

బల్మూర్: భూ తగాదాలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో శనివారం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. మండలంలోని గట్టుతుమ్మెన్ గ్రామానికి చెందిన బొల్లం తిరుపతయ్య తనకు భూమి వాటా తక్కువగా ఇచ్చారని సోదరులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో అతడి సోదరులు యాదయ్య, మల్లయ్య, మరదలు జయమ్మలు కలిసి తిరుపతయ్యతో పాటు అతని కుమారుడు రాజుపై గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో తిరుపతయ్యకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సర్దార్ సర్వాయ్‌పాపన్న జయంతి



పెద్దకొత్తపల్లి: మండలంలోని జై గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం అధ్యక్షురాలు సోమ ప్రగతిగౌడ్, నాయకులు హరీష్‌గౌడ్ లు పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు యుగంధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చక్రధర్ గౌడ్, సత్యంగౌడ్, వంశీగౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు లలితారాణి, సుగుణమ్మ, లింగస్వామి గౌడ్, గోపిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల దీక్షకు మద్దతు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు స్థానిక గాంధీ పార్కులో దీక్ష చేపట్టారు. ఈ మేరకు శనివారం బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ నరిగె నరేందర్, బహుజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, అతిథి అధ్యాపక సంఘం జిల్లా అధ్యక్షుడు కావలి కృష్ణ, కార్యదర్శి రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంధం నాగరాజు, పురుషోత్తం, మహిళా కన్వీనర్ వాణి, పావని, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధమవుదాం

పెద్దకొత్తపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాల్ నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ మండల సమితి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు విడిపోయినా నేటికి విభజన సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అవసరమున్న నిధులు కేటాయించకుండా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని ఆయన అన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. శ్రీనివాసులు, లక్ష్మీపతి, శ్రీనివాసులు,వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ చేయాలి



తెలకపల్లి: అర్హులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో అర్హులకు రుణమాఫీ చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నందిపేట భాస్కర్, కమిటీ సభ్యులు గోపస్ లక్ష్మణ్, విజయ్‌గౌడ్, ఉస్సేన్, బోగరాజు లక్ష్మయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు..

కల్వకుర్తిరూరల్: ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన మేరకు రూ.2 లక్షల రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు. పార్టీ జిల్లా విస్తృత సమావేశం ఈ నెల 21న అచ్చంపేటలో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి బాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో మల్లయ్య, పరుశరాములు, సిద్ధయ్య, శేఖర్, శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సదానందంను శనివారం టీపీఎస్ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎస్ఎఫ్ నాయకులు మురహరి, అన్వేష్, గిరి, ఫయాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి



కల్వకుర్తిరూరల్: శ్రీశైలం దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మార్గమధ్యలో కల్వకుర్తిలో హ్యూమన్‌రైట్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు శ్రీనివాస్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా శనివారం రైస్‌మిల్లర్లు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, దర్శి సాయిరాజ్, జూలూరు రవి, గోవిందు కృష్ణయ్యతో పాటు లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు కల్మిచర్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూమిని పంపిణీ చేయాలి

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పేదలకు ఇస్తానన్న భూమిని, ఇళ్ల స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని జటప్రోల్, మంచాలకట్ట, మల్లేశ్వరం, గోపులాపూర్ వంటి గ్రామాల్లో పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు, సాగు భూములు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాలన్నారు. మాయామాటలతో ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నాయి కాని సమస్యలు పరిష్కరించే దిశగా నిర్ణయాలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎల్లగౌడ్, హనుమంత్, తిమ్మస్వామి పాల్గొన్నారు.

మున్నాసాద్ మహరాజ్ భోగి వేడుకలు



పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండలంలోని సిలోనిబావితండాలో శనివారం గిరిజనులు భక్తిశ్రద్ధలతో మున్నాసాద్ మహరాజ్ భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీని మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలను కాపాడుకుందామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంజీవ్‌కుమార్‌యాదవ్, కాడురామ్ నాయక్, నాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న రోడ్డు పనులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని చిన్నకొత్తపల్లి నుంచి యాపట్ల మధ్య 6 కిలోమీటర్ల మేర అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. 2012లో తీగలపల్లి క్రాస్ రోడ్డు నుంచి యాపట్ల క్రాస్ రోడ్డు వరకు 21 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులు చేపట్టేందుకు రూ.21 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ తీగలపల్లి నుంచి పెద్దకొత్తపల్లి వరకు రెండు కిలోమీటర్లు బీటీ పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. 2021లో అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పెద్దకొత్తపల్లి నుంచి మైసమ్మ ఆలయం వరకు బీటీ రోడ్డు పనులు చేయించారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను ఆయా గ్రామాల ప్రజలు మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో కొల్లాపూర్ నుంచి సాతాపూర్ మీదుగా నాయినోనిమైసమ్మ దేవత వద్దకు వచ్చే భక్తులకు రోడ్డు కష్టాలు తీరనున్నాయి. యాపట్ల, రాయవరం, లింగాల, అంబటిపల్లి, జగన్నాథపురం, చిన్నకొత్తపల్లి గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి.



యాపట్ల రోడ్డుపై లెవలింగ్ చేస్తున్న రోడ్డురోలర్